క్లుప్తంగా

వైభవంగా అంజన్నకు పూజలు



ఫిరంగిపురం: ఫిరంగిపురం మండలం వేమవరం గ్రామంలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామివారి 21వ వార్షికోత్సవం ఈనెల 7న నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం పదహారు రోజుల పండుగను విశేషంగా జరిపారు. ఉదయాన్నే స్వామికి నాగవల్లీ దళాలతో అష్టోత్తర, సహస్రనామ పూజలు చేశారు. పొంగళ్లను స్వామివారికి నివేదన చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త పొట్టి వీరేశం గుప్తా, గ్రామపెద్ద కె.పేరారెడ్డిలు పర్యవేక్షించారు.

కార్మికులకు బకాయిలు చెల్లించాలి



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు ఆదివారంతో 201వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని యూనియన్ నాయకుల కూరపాటి స్టీవెన్ సందర్శించి కార్మికులకు మద్దతు తెలియజేసి మాట్లాడారు. కార్మికులు తమకు రావాల్సిన బకాయిల కోసం దీక్షలు చేస్తున్నారని.. నేటికీ యాజమాన్యం కానీ, ప్రభుత్వం కానీ స్పందించకపోవడం విచారకరమని అన్నారు. కార్యక్రమంలో సుబ్బారావు, సుభాని, శారద, నవనీతం, రమణ, హగ్గయ్య, గురవయ్య, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరా నిలిపివేత

తెనాలిఅర్బన్: దుగ్గిరాల సమీపంలోని మద్రాస్ రైల్వే గేటు వద్ద రక్షిత మంచినీటి పైప్‌లైన్ మరమ్మతుల నేపథ్యంలో పట్టణంలోని పినపాడు, గాంధీపార్కు, ఉడాకాలనీ, చినరావూరులలోని వాటర్ ట్యాంక్‌లకు సోమవారం నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతులు పూర్తి అవగానే నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని చెప్పారు. ప్రజలందరూ సహకరించాలని సూచించారు.

ఏడాది గడచినా హామీల అమలు లేదు

సీపీఎం నేతతో వివిధ గ్రామాల ప్రజలు



తెనాలి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా హామీలను అమలు చేయటం లేదని సీపీఎం తెనాలి రూరల్ మండల కార్యదర్శి ములకా శివసాంబిరెడ్డి అన్నారు. మండల గ్రామాలైన కంచర్లపాలెం, గుడివాడ, కొలెవరం గ్రామాల్లో ఆదివారం ఆయన ప్రజలను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గలేదని తెలిపారు. రైతులు పండిస్తున్న ధాన్యం, జొన్నలు, మొక్కజొన్నలు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదని స్థానికులు ఆయనకు తెలియజేశారు. పంటకాల్వలు, మురుగు కాల్వల మరమ్మతులు పూర్తిస్థాయిలో చేయలేదన్నారు. గుడివాడ–అంగలకుదురు మధ్యలో గల కోపల్లె మైనర్ డ్రెయిన్ మరమ్మతులు చేయాల్సి వుందన్నారు. శివసాంబిరెడ్డి మాట్లాడుతూ 2019 చట్టం వల్ల కౌలు రైతులకు నష్టం జరుగుతుందనీ, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే దానిని రద్దుచేసి, రైతులకు మేలు చేసే విధంగా చట్టం చేస్తామనీ, కౌలు రైతులకు రూ.20 వేల పెట్టుబడి సాయం అందిస్తామని కూటమి నేతలు ఇచ్చిన వాగ్దానం అమలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని ఆయన కోరారు. తల్లికి వందనం ఆర్థికసాయం లబ్ధిదారులు అందరికీ పడటం లేదని, ప్రభుత్వం అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని సాంబిరెడ్డి డిమాండ్ చేశారు.

రోటరీ క్లబ్‌ల పాలకవర్గాలకు శిక్షణ సదస్సు

తెనాలి: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో ఆదివారం రోటరీ క్లబ్‌ల బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల ట్రైనింగ్ సెమినార్‌ను ఆదివారం నిర్వహించారు. అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్ పర్యవేక్షణలో 2025–26 సంవత్సరానికి తాడేపల్లి, మంగళగిరి, తెనాలి, పొన్నూరు, రేపల్లె రోటరీ క్లబ్‌ల బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లకు ఈ సెమినార్‌ను ఏర్పాటుచేశారు. పాస్ట్ గవర్నర్ అన్నె రత్నప్రభాకర్, అనిల్ చక్రవర్తి, డాక్టర్ విష్ణుబాబు, కె.సీ తారమేష్‌లు ట్రైనింగ్ ఇచ్చారు. ఆయా క్లబ్‌ల అధ్యక్ష, కార్యదర్శులు, బోర్డు డైరెక్టర్లు పాల్గొన్నారు. తెనాలి క్లబ్ తరపున అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు, కార్యదర్శి దేవయజనం మురళీకృష్ణ, 2025–26 అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు, జీవీ నారాయణ, కోశాధికారి వెంపటి హరిప్రసాద్, డిస్ట్రిక్ట్ మెంబర్లు గుత్తా వెంకటరత్నం, ధూళిపాళ్ల రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మహానేత విగ్రహానికి ముసుగు

- చినకాకాని ఆరోగ్య కేంద్రంలో విచిత్ర పరిస్థితి
- ఉన్నతాధికారుల ఆదేశాలంటున్న సిబ్బంది
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు



చినకాకాని ఆరోగ్య కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహానికి వేసిన ముసుగు

మంగళగిరి: సంక్షేమ పథకాల రూపశిల్పి, దివంగత ముఖ్యమంత్రి మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి అధికారులు ముసుగు వేశారు. అధికారుల వింత పోకడాలను చూసిన మంగళగిరి నగర ప్రజలు విస్తుపోతున్నారు. మంగళగిరి మండలం చినకాకాని ఆరోగ్య కేంద్రంలోని డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ముసుగు వేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో పేదలకు ఉచిత వైద్యం ఇంటి వద్దనే అందించాలనే లక్ష్యంతో మంగళగిరి, తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలో డాక్టర్ వైఎస్సార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వం కేటాయించిన నిధులతో పాటు కార్పొరేషన్ నుంచి నిధులు కేటాయించి ఆయా ఆరోగ్య కేంద్రాలను తీర్చిదిద్దారు. ఒక్కో ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులు, 10 బెడ్లు, సిబ్బందిని నియమించారు. వైఎస్సార్ పేరుతో ఏర్పాటు చేసిన ఆరోగ్య కేంద్రాలలో మహానేత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ విగ్రహాలను ఏర్పాటు చేశారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరోగ్య కేంద్రాలకు వైఎస్సార్ పేరును తొలగించారు. కాగా ఆయా ఆరోగ్య కేంద్రాలలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహాలకు ముసుగులను వేశారు. దీంతో వైఎస్సార్ అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ముసుగులు వేయడం దుర్మార్గం..



దివంగత ముఖ్యమంత్రి మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మృతి చెంది 14 ఏళ్లు గడుస్తున్నా ప్రజల గుండెలలో చిరస్థాయిగా నిలిచారు. పేదల సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా పని చేసిన నాయకుడు విగ్రహాలకు ముసుగులు వేయడం దుర్మార్గం. విగ్రహాలకు ముసుగులు వేసినంత మాత్రానా ప్రజల మనస్సులలో వైఎస్సార్‌ను తొలగించలేరు. వైఎస్సార్ అంటే చంద్రబాబుకు ఎంత భయయో ప్రజలకు అర్థమవుతుంది.

– సంకే సునీత, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం పట్టణ నాయకురాలు

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

తాడేపల్లి రూరల్: జూలై 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం ఏఐటీయూసీ, సీఐటీయూ, ఏఐఎఫ్‌టీయూ న్యూ, వైఎస్సార్‌టీయూ సంఘాల ఆధ్వర్యంలో మంగళగిరి సీఐటీయూ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను హరించే లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. దీని వల్లకార్మికులు సంఘాలను పెట్టుకునే అవకాశం ఉండదని అన్నారు. పని గంటలు పెరుగుతాయని.. కార్మికుల హక్కులను ప్రశ్నించేందుకు అవకాశం ఉందని తెలిపారు. సార్వత్రిక సమ్మెను జయప్రదం చేసేందుకు మంగళగిరి పట్టణంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థలకు సమ్మె నోటీసులు ఇవ్వాలని సూచించారు. జూలై 7, 8 తేదీలలో మైక్ ప్రచారం నిర్వహించాలని తీర్మానించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి నందం బ్రహ్మేశ్వరరావు, సీపీఐ 17వ వార్డు శాఖ కార్యదర్శి గండికోట దుర్గారావు, ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, వీవీ జవహర్‌లాల్, సీఐటీయూ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు వై.కమలాకర్, ఎం.బాలాజీ, సీఐటీయూ సీనియర్ నాయకులు జేవీ రాఘవులు, సీఐటీయూ నాయకులు శ్రీరాములు, ఏఐఎఫ్‌టీయూ న్యూ నాయకులు కోటేశ్వరరావు, వైఎస్సార్‌టీయూ నాయకులు ఆర్.శ్రీనివాసరాజు, నక్క నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ అధ్యక్షులుగా ప్రెగడ రాజశేఖర్



ప్రెగడ రాజశేఖర్

మంగళగిరి, తాడేపల్లి రూరల్: మంగళగిరి రోటరీ క్లబ్ నూతన అధ్యక్షులుగా ప్రెగడ రాజశేఖర్ ఎన్నికయ్యారు. ఆదివారం రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి సమావేశాన్ని చినకాకానిలోని ఓ హోటల్‌లో గాజుల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 3125 మాజీ గవర్నర్ అన్నే రత్నప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. రెండు తెలుగు రాష్ట్రాల్లో మంగళగిరి రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాలతో ముందంజలో ఉందని అన్నారు. అనంతరం 2025–26 నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి నూతన అధ్యక్షులుగా ప్రెగడ రాజశేఖర్, ఉపాధ్యక్షులుగా అందే మురళి, కార్యదర్శిగా పారేపల్లి నిరంజన్ గుప్తా, సహాయ కార్యదర్శులుగా కాపరౌతు సుందరయ్య, జొన్నాదుల భిక్షారావు, కోశాధికారిగా కేవీఎస్ ప్రకాశరావును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు రావెల శ్రీనివాసరావు, ఇసునూరి అనిల్ చక్రవర్తి, జీఎస్ నాయక్, గోలి శ్రీకాంత్, చనుమోలు గోపాల్, ఉడతా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నేతాజీ

తాడేపల్లి రూరల్: కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లి రూరల్ పరిధిలోని గుండిమెడ గ్రామంలో సీపీఎం నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం దాటిందని, ఇప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని అన్నారు. అన్ని హామీలు అమలు చేశామని రాష్ట్ర ప్రభుత్వం ఉత్సవాలు జరుపుకొంటోందని విమర్శించారు. నియోజకవర్గంలో ఇల్లు లేని పేదలకు ఇంటి స్థలంతో పాటు గృహ నిర్మాణ పథకం ద్వారా ఇల్లు నిర్మించి ఇస్తామని నారా లోకేష్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కృష్ణానది పక్కనే ఉన్నా తాడేపల్లి ప్రాంతంలో ఇప్పటికీ మంచినీటి సమస్య ప్రధానంగా ఉందని అన్నారు. 200 రోజులుగా ఏసీసీ కార్మికులు నిరాహార దీక్షలు చేస్తున్నా పట్టించుకోవడం లేదని అన్నారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సూర్యారావు, సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరగ వెంకటేశ్వర్లు, తాడేపల్లి మండల కార్యదర్శి పల్లెకృష్ణ, సీనియర్ నాయకులు వేముల దుర్గారావు, నాయకులు ఎస్కే గస్, పల్లె భార్గవ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించం

మంగళగిరి: రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే ఉపేక్షించమని.. వారిపై పీడీ యాక్ట్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకట్ తెలిపారు. ఆదివారం మంగళగిరి రూరల్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలు, భూదందా, అధిక వడ్డీలు వసూలు చేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లపై నిరంతరం నిఘా ఉంచి ఎవరైనా అనుమానాదస్పదంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు నగర బహిష్కరణ తప్పదని రూరల్ ఎస్ఐ హెచ్చరించారు.

సర్వసభ్య సమావేశం నేడు

ఫిరంగిపురం: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పూషాడపు శివ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఎంపీపీ షేక్ షహేలా నర్గీస్ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. మండలంలోని నిర్వహిస్తున్న పలు అభివృద్ధి పనులకు సంబంధించి సమీక్ష ఉంటుందన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, వివిధ గ్రామాల సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని ఆయన అన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఫిరంగిపురం: మండంలోని 8 గ్రామాలకు సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం సోమవారం విద్యుత్ సరఫరా నిలలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ దుర్గాప్రసాద్ ఆదివారం తెలిపారు. నుదురుపాడు, మేరికపూడి, మునగపాడు, పొనుగుపాడు, గుండాలపాడు, బేతపూడి, కండ్రిక, యర్రగుంట్లపాడు గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎన్టీఆర్ కరకట్టపై దొంగ హల్‌చల్

నిమిషాల వ్యవధిలో ఆరు సెల్‌ఫోన్‌లు, ఒక బంగారు ఉంగరం చోరీ

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని ఎన్టీఆర్ కరకట్టపై ఆదివారం తెల్లవారు జామున ఓ దొంగ ఇళ్లలోకి చొరబడి దొంగతనాలకు పాల్పడ్డాడు. సేకరించిన వివరాల ప్రకారం.. నాగేంద్రస్వామి పుట్ట సమీపంలో రోడ్డు వెంబడి ఉన్న నాలుగు నివాసాల్లో ఓ దొంగ సెల్‌ఫోన్లు, బంగారపు ఉంగరం చోరీ చేశాడు. గత వారం రోజులుగా ఉక్కపోతగా ఉండడంతో ఆ ప్రాంతంలో నివాసం ఉండే వారంతా తలుపులు తీసి నిద్రపోతున్నారు. ఇదే అదునుగా చేసుకున్న ఓ దొంగ ఆరు సెల్‌ఫోన్‌లు, ఒక బంగారు ఉంగరం దొంగిలించాడు. ఐదవ ఇంట్లోకి వెళ్లే సమయంలో వారు లేచి అరవడంతో ఎన్టీఆర్ కరకట్ట దిగి పంటపొలాల్లోకి పరారయ్యాడు. స్థానికులు వెంబడించినా అతని ఆచూకీ లభించలేదు. జరిగిన సంఘటనపై బాధితులు తాడేపల్లి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.

ప్రజా పోరాటమే వైఎస్సార్ సీపీ లక్ష్యం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి

- పదవి వచ్చిన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి
- వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనకు, కూటమి పరిపాలనకు తేడాను వివరించాలి
- మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి

తాడేపల్లి రూరల్: కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకూ ప్రజాపోరాటం ఆగదని.. ఆ లక్ష్యంగానే వైఎస్సార్‌సీపీ పనిచేస్తుందని వైఎస్సార్‌సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేట వైఎస్సార్‌సీపీ యూత్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఎండి గోరేబాబుకు ఘన సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వేమారెడ్డి మాట్లాడుతూ.. ఎండి గోరేబాబు కార్యకర్త స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి ఎన్నికయ్యారని, ఎంతో నిబద్ధతతో పార్టీ బలోపేతానికి కృషి చేశారని అన్నారు. రానున్న కాలంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకూ ఆయన వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి పోరాటాల్లో పాల్గొని ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తామని తుంగలో తొక్కారని.. సోమవారం గుంటూరు కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేసి ప్రభుత్వానికి మన నిరసనను వ్యక్తం చయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదుల మూడి డేవిడ్ రాజు, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నబోతుల దుర్గారావు, మంగళగిరి నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు మల్లేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్మిక సంఘం అధ్యక్షులు శ్రీనివాసరాజు, ఇర్ఫాన్, జిలాని, కంచర్ల రమణ, నులకపేట వైఎస్సార్‌సీపీ యూత్, తదితరులు పాల్గొన్నారు.

‘యువత పోరు’ను జయప్రదం చేయాలి

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త దొంతిరెడ్డి వేమారెడ్డి

తాడేపల్లి రూరల్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా యువత పోరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని.. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. ఆదివారం మంగళగిరి ఆత్మకూరులోని నియోజకవర్గ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి నిరుద్యోగికి రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చిందని.. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఒక్క రూపాయి కూడా నిరుద్యోగులకు ఇవ్వలేదని అన్నారు. ఇప్పటి వరకూ లెక్కలు వేస్తే ఒక్కో నిరుద్యోగికి 36 వేల రూపాయలు రావాలని.. కూటమి ప్రభుత్వం వెంటనే నిరుద్యోగ భృతి అందజేయాలని లేకుండా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఉద్యమం నిర్వహిస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో మంగళగిరి రూరల్ అధ్యక్షులు నాలి వెంకటకృష్ణ, మంగళగిరి నియోజకవర్గ యువజన అధ్యక్షులు మహమ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి: వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టిన యువత పోరును విజయవంతం చేయాలని పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో నిరుద్యోగ యువతీ, యువకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గుంటూరు కలెక్టరేట్ వద్ద యువత పోరుకు హాజరై జయప్రదం చేయాలని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

హత్యాయత్నం కేసులో నిందితుడు గుర్తింపు

దుగ్గిరాల: చిలువూరు గ్రామంలో యువకుడు ప్రభాస్‌పై శనివారం రాత్రి జరిగిన హత్యాయత్నం కేసులో పోలీసులు ఒక కుటుంబాన్ని అనుమానిస్తున్నట్లు సమాచారం. ఆదివారం జరిగిన విచారణలో.. చిలువూరుకి చెందిన ప్రవీణ్ అనే యువకుడు ప్రభాస్‌పై హత్యాయత్నం చేసినట్లు పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో నిర్ధారించినట్లు సమాచారం. 2023వ సంవత్సరంలో ప్రవీణ్ సోదరుడు ప్రదీప్, ప్రభాస్‌లు 9వ తరగతిలో మిత్రులు. చిలువూరు రైల్వే ట్రాక్‌పై మృతి చెందిన ప్రదీప్‌ను ప్రభాస్ చంపినట్లు ప్రవీణ్‌కు అనుమానం. అప్పటి నుంచి మనసులో పెట్టుకున్న ప్రవీణ్ సమయం కోసం ఎదురు చూసి ప్రవీణ్ ఇంటి సమీపంలో తిరుగుతున్న ప్రభాస్‌ను నిర్దాక్షిణ్యంగా అతి దారుణంగా నరికాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ప్రభాస్ ప్రస్తుతం గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. కాగా పోలీసులు పరారీలో ఉన్న ప్రవీణ్‌ను గాలిస్తున్నారు. ప్రవీణ్ తల్లిదండ్రులు కూడా పరారీలో ఉండడం గ్రామంలో చర్చనీయాంశం అయ్యింది.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం



పురస్కారాల ప్రదానం చేస్తున్న అతిథులు

తెనాలి: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉత్తమ పౌరులుగా ఎదగాలని ప్రముఖ పారిశ్రామికవేత్త, కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం సూచించారు. వీరబ్రహ్మేంద్ర ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏటా నిర్వహిస్తున్న ప్రతిభా పురస్కారాలను, 2025 సంవత్సరానికి ఆదివారం ప్రదానం చేశారు. ముత్యంశెట్టిపాలెంలోని పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ కళ్యాణమండపంలో జరిగిన సభకు ట్రస్ట్ అధ్యక్షుడు ఈఎల్‌వీ అప్పారావు అధ్యక్ష వహించారు. పది పరీక్షల్లో పట్టణంలోని ఆరు మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ట్రస్ట్ కోశాధికారి సామ్రాజ్యలక్ష్మి రూ.49 వేలను ప్రతిభా పురస్కారాల కింద అందజేశారు. డాక్టర్ జస్వంత్, అత్తలూరి బాలమురళీకృష్ణ, శాఖమూరి మల్లికార్జునరావు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు తన్నీరు శివశంకర్, బుర్లె అరుణకుమారి, రమేష్, శారదను సత్కరించారు. ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాంబిరెడ్డి సంస్మరణ సభ

తెనాలి: పెదకాకాని దేవస్థానం బోర్డు పూర్వ సభ్యుడు కొండమడుగుల సాంబిరెడ్డి సంస్మరణ సభను ఆదివారం రాత్రి ఇక్కడి తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో నిర్వహించారు. ప్రఖ్య చిల్డ్రన్ ఆర్ట్స్ థియేటర్, తెనాలి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ముఖ్యఅతిథిగా హాజరై, సాంబిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రముఖ రంగస్థల నటుడు కావూరు సత్యనారాయణ, శ్రీనివాసరావు (లింగారావుపాలెం), ఏపూరి హరిబాబు(గుంటూరు), గోపాలరెడ్డి (పెదకాకాని), జె.సాంబశివరావు (వింజనంపాడు) తదితరులు పాల్గొన్నారు. సభానంతరం అద్దేపల్లి–ఆరాధ్యుల ఆర్ట్స్, తెనాలి వారి ‘ఎవరు’ సాంఘిక నాటికను ప్రదర్శించారు. ఆరాధ్యుల తేజస్వి ప్రఖ్య రచనకు అద్దేపల్లి లక్ష్మణశాస్త్రి దర్శకత్వం వహించారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



పూర్వ విద్యార్థులు

- 51 ఏళ్ల తర్వాత కలుసుకున్న పాత మిత్రులు
- కొలకలూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1973–74 బ్యాచ్ టెన్త్ విద్యార్థుల కలయిక

తెనాలిటౌన్: పూర్వ విద్యార్థులంతా ఒక చోట చేరి పాఠశాల అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమని కొలకలూరు జడ్పీ హైస్కూల్ హెచ్ఎం మాచర్ల నాగేశ్వరరావు కొనియాడారు. రూరల్ మండలం కొలకలూరు జిల్లా పరిషత్ హైస్కూల్ 1973–74 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ కలయిక నిర్వహించారు. నాడు తాము చేసిన అల్లరిని గుర్తు చేసుకుంటూ, అప్పటి తరగతి గదుల్లో కూర్చుని మురిసిపోయారు. తమవంతుగా పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని సంకల్పించారు. అనంతరం హెచ్ఎం మాచర్ల నాగేశ్వరరావును దుశ్శాలువాతో సత్కరించారు. 51 సంవత్సరాల నాటి విద్యార్థులంతా ఒక చోటకు చేరి ఆత్మీయ కలయిక నిర్వహించడం అభినందనీయమని హెచ్ఎం పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ షేక్ జిలానీ, పూర్వ విద్యార్థులు చుండూరు శ్యామ్‌సుందర్, వైడీఎస్ రవి, గూడపాటి కోటేశ్వరరావు, బర్తిపూడి వెంకటేశ్వరరావు, దశరథ రామయ్య, ఆరాధ్యుల రమాదేవి, గంపల సామ్రాజ్యం, వెలుగురి రమాదేవి, సుమతి, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



తెనాలిఅర్బన్: విధులకు సకాలంలో హాజరు కావాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు సూచించారు. పట్టణంలోని 5,6 శానిటేషన్ డివిజన్ పరిధిలో ఆదివారం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వాహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే అటెండెన్స్‌ను పరిశీలించారు. అందరూ తప్పనిసరిగా సకాలంలో విధులకు హాజరు కావాలని సూచించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ తిరుమలశెట్టి ప్రసాద్, పలువురు సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.